# సుక్కి

-భూపాల్

అడవిలో పది సంవత్సరాల క్రితం... పుట్టలో పాము పిల్లల్ని తీసింది. చెట్టుమీద పక్షి గుడ్లు తొలుచుకొని ఆరు పిల్లలు బయటపడ్డాయి. కొండ అంచున బొయ్యారం లాంటి బండరాయి సొరికెలో నక్క రెండు పిల్లల్ని కన్నది. అట్లే కొండ అంచునున్న వలసలో మేక రెండు పిల్లల్ని వేసింది. ఆ వలసలోనే పూరి గుడిసెలో సుక్కి ఒక పాపడ్ని కన్నది.

ఆరిక సోములు మొదటిసారిగా గొరడ సంతలో సుక్కిని చూసినప్పుడు, కండలు గుండెలు ఎత్తుగా వున్న పసుపురంగు వన్నెలాడి వడిజేరితే బాగుండుననుకున్నాడు. ఏ ఊరో? ఎలా ఒచ్చిందో? ఎంత బరువు గంప మోసుకొచ్చిందో? చూశాడు. సరుకులమ్మిన కావడిబద్ద భుజానుండగానే నేరుగా సుక్కి ఎటు వెళుతుందో చూసి జీలుగువలస అమ్మాయని తెలుసుకున్నాడు. ప్రతివారం సంతలో కలసి చూసి చూసి కవ్వించీ నవ్వించీ కన్నులూ, మనసూ కలిపాడు. 'మనం మనువాడుదామా?' అన్నాడు. లేవదీసుకుపోయాడు. వారం రోజులకు తిరిగొచ్చి... పెద్దలతో చెప్పి సుక్కివాళ్ళ గ్రామానికి వాళ్ళను పంపించాడు. పిల్లను అడిగారు. చెట్టు ముహూర్తం చూశారు. ఆ చెట్టు ముహూర్తంలో చుక్కల లెక్కలు చూసి, జ్యోతిష్యం చెప్పి, సుక్కి సోములు ఆదిదంపతులే అన్నారు. గ్రహాలు, నక్షత్రాలు, చెట్లు అన్నీ సరిగ్గా కుదిరాయి. సుక్కి దీర్ఘ సుమంగళిగా వుంటుందనీ, ముహూర్తంనాడు అందరూ కలిసి పెళ్ళి చేశారు. అదిగో అలా పదకొండు చలికాలాల క్రితం సుక్కి ఏనుగుల వలసకొచ్చింది. ఆ వలస పక్కనే వున్న గాలికొండ ఎక్కింది. భర్త సోములుతో సరిసమానంగా పోడు నరికింది. పంట పొలంలోనే పాక వేసుకుంది. పగళ్ళు పాకలో వుంటూ రాత్రుళ్ళు గ్రామం చేరుతూ... పంట తీసింది. మంచి రోజులు ముహూర్తాలు చూసే కందికొత్త మొదలు మామిడి టెంక కొత్త వరకూ ఏదీ వదలకుండా తమ గిరిజన సాంప్రదాయం ప్రకారమే సంసారం చేసింది సుక్కి.

పగలు గాలికొండ సాక్షిగా, రాత్రుళ్ళు సుక్కలూ, చంద్రుడూ సాక్షిగా, జ్యోతిష్యం, చెట్టు ముహూర్తం సాక్షిగా, పక్షుల, కీటకాల పలుకుల సాక్షిగా కండబిగువుగల కొండన్న కౌగిలిలో పరవశించి, పులకరించి ఏడేండ్ల క్రితం మగపిల్ల వాడ్ని కన్నది. వాడు సోమవారంనాడు పుట్టాడు కనుక సూరిగాడు అని పేరు పెట్టింది.

తర్వాత రెండేండ్లకు ఆదివారంనాడు పుట్టిన ఆడపిల్లకు ఆదెమ్మ అని పేరు పెట్టుకుంది.


ఇద్దరు పిల్లల్ని కాసిన సోములు పోడు వ్యవసాయం మీదే నాలుగు పొట్టలు నిండేలా లేదని తెలుసుకున్నాడు. కట్టెలు నరికి కావడి గట్టుకొని పదుల మైళ్ళు నడిచి సంతల్లో కర్రలమ్మేవాడు. అడవి లోలోపలికెళ్ళి ఇప్ప చెట్ల కింద రాలిన ఇప్ప పువ్వు ఏరుకొచ్చేవాడు. ఇంత సారా కాసుకొని మిగిలిన పువ్వంతా అమ్ముకొచ్చేవాడు. అలా ఇప్పపువ్వు ఏరుకొచ్చే సోములు ఒకరోజు పెందలాడే మసక చీకట్లో ఎలుగుబంటి పంజా వాతన పడ్డాడు. ఆ సమయంలో ఎలాగో తప్పించుకొని వచ్చి వారం తిరగకముందే కన్నుమూశాడు.

సోములు చనిపోయి ఐదు సంవత్సరాలు గడిచాయి. సుక్కి ఏనుగుల వలస వదలలేదు. తన భూమీ, చెట్టూ, చేమా వదలలేదు. తను కట్టెలు నరికి మోపులు గట్టుకొని సంతలకెళ్ళేది. ఇద్దరు పిల్లలైరి. వాళ్ళతో పొలానికెళితే పనిసాగదని... బువ్వతో వండే సారా తాగించి పిల్లల్ని మత్తులో ముంచి తాను పనికెళ్ళేది కొంతకాలం. కొడుకు

సూరిగాడు కొంచెం చేతికందినాడని ఆరేండ్ల ప్రాయంలోనే పశువుల వెంట పంపించింది మరొకరికి తోడుగా...

***

ఇప్పుడు సూరిగాడికి పదేండ్లు. వాడి తలా, మొండెం వేరు చేయబడి భూమిమీద పడి ఉన్నాయి. ఆకాశం కేసి చూస్తూ 'అమ్మా' అని పిలిచినట్టు, ఆ కళ్ళు అమ్మకోసం ఆక్రందించినట్టున్నాయి. కన్న కొడుకును అలా చూసిన సుక్కి "వీడు నా కొడుకేనా? నా పేగు తెంచుకొని నేలనపడ్డ ఆనాటి మాంసం ముద్దేనా ఈ పిండం? వీడు ఏ పాపం చేశాడు? ఎవరి కొంపలార్పాడు? వీడి వయస్సెంత? ఎందుకు వీడి తల తెగ్గోశారు? అప్పుడే వీడు భూమికి భారమై మన్నులో మన్ను కావలసొచ్చిందా? ఎందుకు? ఈఅడవిలో పాములాగా, పక్షిలాగ, అడవి జంతువులాగ, పశువులాగ చెట్టు చేమ పులుగులాగే పెరుగుతున్న వీడు, నా పసివాడు, వీడి తల ఎందుకు నేలరాలింది? నా జవ సత్వాలతో, నా చెమట చుక్కలతో, నేను గొప్పి తీసిన బలంతో కేవలం వర్షాధారంగా మొలచిన మొక్కలు రాల్చిన పొడిగింజల జావతోనే పెరిగింది ఈ తల. పుట్టిననాడు పిడికెడు తల పెరిగీ పెరిగీ రెండు చేతుల్లో ఒదిగేలా ఎదిగి కత్తివేటుకు నేలపై దొర్లడమేమి?"



గాలికొండకు తూర్పున సుక్కి పోడు చేస్తున్న గుడ్డముంటే, ఉత్తరం వైపున గుడ్డిలో... గుడ్డి మధ్యలో బోడిగుండులా వున్న 'రాయి'. రాయి ముందు ఎదురుగా ఆకులో అన్నం. అన్నం మెతుకులమీద పసుపూ కుంకం చల్లి వుంది. ఆ రాయికి బొట్లున్నాయి. దాని ముందే వాడిని వెల్లకిల నేలన పడేసి ఒకరు కాళ్ళూ చేతులు పట్టుకోగా, మరొకరు ఎడమచేత్తో తలవెంట్రుకలు పట్టుకొని భూమికి అదిమిపట్టి శరీరం నుండి తలను వేరుచేయడం కళ్ళారా చేసిన పాప ఆ సూరిగాడి చెల్లే ఆది.

పగలు ఊరి మొదట చింతచెట్టు కింద ఉన్న అన్నయ్యకు అతను ఏదో ఇవ్వడం దూరం నుండి చూసింది ఆది. ఇంకా అతను ఎక్కడికో తీసికెళ్ళి ఇంకేమి ఇస్తాడోనని మెల్లగా, చాటుగా వాళ్ళనిద్దరినీ వెంబడించింది. అన్నయ్యా, అతనూ, అతనితో బాటుగా మరోవ్యక్తి - ఆది పొదల మాటునుండి అంతా చూస్తోంది. వాళ్ళిద్దరూ అన్నయ్యను గట్టిగా పట్టుకొని తల తెగ్గోశారు. ఆది అక్కడుండలేదు. చాటుగా మాటుగా పరుగు దీసింది. భయంతో వణికిపోయింది. సూరిగాడు నేలన పడి గింజుకోవడం, అరవడం, వాడి నోరు గట్టిగా నొక్కిన దృశ్యం చూసి తట్టుకోలేక పరుగే పరుగు... అరిస్తే తననూ కోసేస్తారనుకుందేమో... ఎవరికి చెప్పాలి? ఏం చెప్పాలి? ఊళ్ళో కొచ్చినా ఎవరూ కనిపించలేదు. పగలు. ఇక చేసేదిలేక

తల్లికోసం, తల్లి ఎక్కడుందోనని పరుగుదీసింది. కొండ... కొండమీద ఎక్కడో...


అరుస్తూ తనను వెదుకుతూ ఆది రావడం. అదీ భయంతో కుందేలు పిల్లలా వణికిపోవడం, ఏడుస్తుండడం చూసి సుక్కి ఒక్కసారే అదిరి పోయింది. మాటరాక, చెప్పలేకపోతున్న పిల్లను మళ్ళీ మళ్ళీ అడిగింది. ఆగి ఆగి ఒక్కొక్క మాటగా చెప్పిన ఆ భయంకర వార్త విని ఆమె శోకాలు పెట్టి ఏడుస్తూ కొండ దిగింది. ముందు నమ్మలేదు ఒక్కక్షణం... పరికించి చూసింది. అంతా నిజమే. అక్కడక్కడ కొండమీద వనిచేస్తున్న నలుగురొచ్చారు, సుక్కితోపాటు. వాళ్ళు రావడం దూరం నుండే చూసి... బలి ఇచ్చిన ఇద్దరూ చెట్ల చాటుగా, తుప్పల మాటుగా దాక్కుంటూ పారిపోయారు. అక్కడి కొచ్చిన అందరికీ తెలిసింది, ఆ పనిచేసింది, బాదు, సుక్రులని... ఆ పొలం గూడా వాళ్ళదే...

సుక్కి జీవితం ఎంతో, బాధలెన్నో, అన్ని బాధలతో బతుకీడుస్తున్న స్త్రీ... బాదు భార్య. సుక్రుకన్న బాదు పెద్దవాడు. బాదు నిద్రపోకుండా వారం రోజులుగా పలవరిస్తుంటే ఏంటో సారామైకం అనుకుంది. ధనలక్ష్మి కలలో కనిపించి "మీ పొలంలో భూమి పొరల్లో ఉన్నారా! లంకెల బిందెల రూపంలో ఉన్నా... నన్ను పైకి తీయరా!" అని గొడవ చేస్తోందని భర్త బాదు ఉదయం చెప్పే వరకు ఆమెకు తెలియదు. తను నమ్మిందా? నమ్మలేదా? అంటే ఆమెను పురుషుడు ఎక్కడ వుంచాడో అక్కడే నిలబడి అర్థంగాక అయోమయంతో వెర్రి వెర్రి చూపులు చూసే వుంటుంది. బాదు తను చేయబోయే పని గురించి మాత్రం చెప్పలేదు. అమ్మ ధనలక్ష్మి నరబలి కోరిందని ఆ పొలంలో సగభాగం సొంతదారైన తమ్ముడు సుక్రుకు చెప్పాడు. తనకు ఒకరి సహకారం అవసరం గనకే చెప్పాడు. "ఆ లంకెల బిందెలు మన పెద్దలు నాటినవే" అన్నాడు. "అప్పటికీ ఇప్పటికీ చెట్టు పెరిగినట్టు ధనమూ పెరిగే వుంటుం"దన్నాడు.

గోచి గుడ్డకు కూడా నోచుకోని తాత ముత్తాతల కాలం నాడు లంకెబిందెలు నిండేంత సొమ్ము ఎలా కూడగట్టబడిందో!? నాలుగు ఎకరాలన్నా సరిగాలేని ఆ పొలంతో, సారంలేని భూమిలో తాతలు ఆకులు, అలాలు, విషపు దుంపలు తింటూ ధనాన్ని ఎలా పాతిపెట్టారో? బాదు, సుక్రులకు ఎవరు చెప్పారో జాతకం, ఎవరు దాన్ని పెంచి పోషిస్తున్నారో? సూరిని తీసికెళ్ళి బలి చేశారు. బలి ఇచ్చాక లంకెల బిందెల కోసం తవ్వడంలో అరగంట ఆలస్యమైందని, దాంతో ఆ బిందెలు మరికాస్త భూమిలోకి చొచ్చుకు పోయాయట! దొరకలేదట!

కొండల్లోని కోదోలు వచ్చి సూరి తలను, మొండాన్ని చూసి వెళ్ళారు. ఒకరోజు తర్వాత పోలీసులూ వచ్చారు. కేసు నమోదు చేశారు. సుక్కి చెట్టులాగ మోడువారిన స్థితిలో నిలబడి వుంది. ఏడ్చి ఏడ్చి అలసిపోయి, పొరలు పొరలుగా తన్నుకొస్తున్న బాధల కెరటాలు మనస్సునంతా కకావికలం చేశాయి. నిలువెత్తు రాయిలాగే నిలబడ్డ ఆమెను పోలీసులు ఎన్నో ప్రశ్నలు వేశారు. తనకు తోచింది, తెలిసింది చెప్పింది. ఆదిని బుగ్గగిల్లి "నువ్వు చూశావేటే?" అని అడిగారు పోలీసు పెద్దసారు. ఆది పేడలో పురుగులా తల ఊపింది.

బాదు, సుక్రు మూడు నెలలపాటు అదృశ్య మయ్యారు. సుక్కి వాళ్ళ కోసం ఒక్క నిమిషమన్నా యోచించినట్టు లేదు. నడుస్తున్న శవంలాగ రోజువారీ పనుల్లో మాత్రం చలనంగా పొద్దును ఎగబాకడం కనిపించింది. తన కడుపు, తన పాప కడుపు నిండేందుకు ఏదో ఒకటి కావాలి. గంజో, రొట్టెనో, అన్నమో, ఆకో, అలమో, దుంపలో, వాటితో ఆకలి తీరాలిగానీ, ప్రతీకారంతో పనేముంది అనుకుందేమో! ఆ హంతకులు ఇండియన్ పీనల్‌కోడ్‌కి దొరకాలనీ, రాజ్యాంగ చట్టాలకు పట్టం గట్టాలనీ లేదు. ఆమె దీనమైన, అమాయకమైన అభం శుభం తెలియని ముఖం మనిషి ఎందుకు బతకాలా అనే ప్రశ్న గుర్తుతో కాలం ఈడ్చుతుంటే... నాలుగు నెలల తర్వాత మళ్ళీ వచ్చారు పోలీసులు– "మాకు నీవు చేసే పనితో సంబంధం లేదు. కోర్టు కోర్టే, చట్టం చట్టమే, మా వృత్తి వృత్తే... నీవు పని వదిలేసి మేం తీసికెళ్ళే చోటికి రావలసిందే" అన్నారు. "తిన




తిండే లేదు. ఇంకా కోర్టులేమిటి? రాలేను" అని మొండికేస్తే ఈడ్చుకెళ్ళేలా ఉన్నారు. అదీగాక తనను ఈ అడవినుండీ, కొండలనుండీ, గుడ్డి నుండీ, చెట్టూ చేమ నుండీ వేరు చేస్తారేమోనని భయపడ్డది. వాళ్ళు రమ్మన్న చోటికి, పసిపిల్లతో వెళ్ళింది. చెప్పింది చేసింది.

చివరకు కోర్టులో " ఆదెమ్మ అనే ఎనిమిదేండ్ల పాప సాక్ష్యం సాక్ష్యం కాదు. బాదు, సుక్రులే ఈ నేరం చేసినట్టు రుజువు కాలేదు. అది ఎవరు చేశారో తెలియదు" అంటూ కేసు కొట్టేశారు. పిల్లవాడు సూరి ఫైల్ క్లోజ్.

సుక్కి కోర్టు ఆవరణ నుంచి నడుస్తున్న శవం లాగ రోడ్డెక్కింది.

రోడ్డు మీద పెద్ద ప్రదర్శన. రోడ్డు నిండా జనం ఊరేగింపుగా వెళుతున్నారు. అంతా చదువుకున్నోళ్ళు. పెద్దగా నినాదాలిస్తూ వెళుతున్నారు.

'భారత్ మాత జిందాబాద్', 'విశ్వ విద్యాలయాల్లో జ్యోతిష్య శాస్త్రాన్ని అడ్డుకునే దేశ ద్రోహుల్లారా ఖబడ్దార్', 'జ్యోతిష్య, కర్మకాండల శాస్త్రాలు మన వారసత్వ సంపద, వాటిని కాపాడుకుందాం', 'భారత్ మాత జిందాబాద్'.

సుక్కికి అవేమీ అర్థం కాలేదు. కూతురు తిండికి మాడుతూ ఇంట్లో ఎలా అల్లాడుతుందోనని గుర్తొచ్చి కంట్లో నీళ్ళు తిరిగాయి.

★